ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




పెద్దపల్లి జిల్లా వార్తలు

5★ బుధవారం 28 ఫిబ్రవరి 2024

గోదావరిఖని ఆర్టీసీ డిపో మేడారం జాతర ఆదాయం రూ.1.3కోట్లు 8లో..

వాహనాలను కండీషన్‌లో ఉంచుకోవాలి - సీపీ శ్రీనివాస్ 8లో..



లోక్‌సభ ఎన్నికలకు సన్నాహాలు

- ఈవీఎంల మొదటి దశ తనిఖీలు పూర్తి
- ఓటర్ల తుది జాబితాలు సిద్ధం
- మూడేళ్లు దాటిన అధికారుల బదిలీలు
- పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చే నెలలో విడుదల కానున్నది. ఈ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అందుకు తగ్గట్లుగా సన్నాహాలు చేపడుతున్నది. రెండు మాసాల క్రితం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల అనుభవనాలను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఎన్నికలకు పారదర్శకంగా నిర్వహించేందుకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చర్యలు చేపట్టారు. ఇప్పటికే పార్లమెంట్ పరిధిలో మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న సంబంధిత శాఖల జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోల బదిలీల ప్రక్రియ పూర్తయ్యింది. ఈవీఎంల మొదటి దశ తనిఖీలు పూర్తికాగా, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. వారి నుంచి వచ్చిన అభ్యంతరాలను కూడా స్వీకరించారు. ఈనెల 13న కేంద్ర ఎన్నికల కమిషన్ ఓటర్ల తుది జాబితాను కూడా విడుదల చేసింది. 2019లో జిల్లాలో ఏప్రిల్ 12వ తేదీన ఎన్నికల పోలింగ్ జరగగా, ఇప్పుడు కూడా అదే నెలలో పోలింగ్ జరిగే అవకాశాలు ఉన్నాయి. వచ్చేనెల మొదటి వారంలో గానీ, రెండవ వారంలో గానీ దేశవ్యాప్తంగా నిర్వహించే ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేయనున్నది. షెడ్యూల్ వెలువడిన రోజు నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి రానున్నది.

బదిలీల ప్రక్రియ పూర్తి..

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పార్లమెంట్ పరిధిలో మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఆయా శాఖల అధికారులు, పోలీసు అధికారులను, తహసీల్దార్లు, ఎంపీడీవోలను ఇతర పార్లమెంట్ నియోజకవర్గాలకు బదిలీ చేశారు. నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తహసీల్దార్లను బదిలీ చేసినప్పటికీ, వాళ్ల పార్లమెంట్ పరిధిలో ఉంటే అక్కడినుంచి మరో చోటికి బదిలీ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు, పార్లమెంట్ ఎన్నికలకు మూడు, నాలుగు మాసాల గ్యాప్ ఉండడంతో ఈ సమయంలో మూడేళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న అధికారులను కూడా బదిలీ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తమకు అనుకూలంగా వ్యవహరించే పోలీస్ అధికారులను బదిలీ చేయగా, రాష్ట్రంలో ప్రభుత్వం మారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. దీంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించిన పోలీసు అధికారులందరినీ బదిలీ చేయడం గమనార్హం. ఎస్‌ఐ నుంచి పోలీస్ కమిషనర్ స్థాయి వరకు పార్లమెంట్ పరిధిలో ఉన్న అధికారులందరినీ బదిలీ చేశారు.

ఓటింగ్ శాతం పెంచేందుకు..

అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదవుతూ ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని నియోజకవర్గాల్లో 90 శాతానికి పైగా పోలింగ్ నమోదు కాగా, పార్లమెంట్ ఎన్నికల్లో 72 శాతానికి పోలింగ్ మించడం లేదు. 2019లో జరిగిన ఎన్నికల్లో 65.59 శాతం, 2014లో జరిగిన ఎన్నికల్లో 71.93 శాతం, 2009లో 68.72 శాతం, 2004లో 67.78 శాతం పోలింగ్ నమోదు కావడం గమనార్హం. 2014లో తెలంగాణ ప్రకటించిన తర్వాత జరిగిన ఎన్నికల్లో మాత్రమే పోలింగ్ శాతం 70 శాతానికి పైగా పెరిగింది. ఆ తర్వాత తగ్గింది. ఈసారి జరిగే ఎన్నికల్లో గతంలో జరిగిన ఎన్నికలకంటే పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఓటర్లకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దేశ భవిష్యత్తు దృష్ట్యా తప్పనిసరిగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు.

15,94,342 మంది ఓటర్లు..



పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. పెద్దపల్లి జిల్లాలో పెద్దపల్లి, రామగుండం, మంథని, జగిత్యాల జిల్లాలో ధర్మపురి, మంచిర్యాల జిల్లాలో మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి జిల్లాలు ఉన్నాయి. నియోజకవర్గ కేంద్రం పెద్దపల్లి జిల్లా కావడంతో జిల్లా ఎన్నికల అధికారిగా పెద్దపల్లి కలెక్టర్ వ్యవహరించనున్నారు. పార్లమెంట్ పరిధిలో మొత్తం 15,94,392 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 7,87,140, మహిళలు 8,05,755, థర్డ్ జెండర్ 101 మంది, సర్వీస్ ఓటర్లు 1,396 మంది ఉన్నారు. అత్యధికంగా పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 2,56,640 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా బెల్లంపల్లి నియోజకవర్గంలో 1,75,508 మంది ఓటర్లున్నారు. పెద్దపల్లి నియోజకవర్గం ఏర్పాటైన నాటి నుంచి 16 సార్లు ఎన్నికలు జరగగా, ప్రస్తుతం జరగబోయే ఎన్నిక 17వ సారి కావడం గమనార్హం. 1500 మంది ఓటర్లకు ఒక పోలింగ్ బూతును ఏర్పాటు చేస్తుండగా, మొత్తం కుటుంబ సభ్యులు ఒకే పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. దీంతో అసెంబ్లీ ఎన్నికలకంటే పోలింగ్ బూతుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయి.

పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు..

క్ర.సం.	నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	సర్వీస్‌ఓటర్లు	మొత్తం
1.	పెద్దపల్లి	126404	129965	07	264	256640
2.	రామగుండం	110255	109970	26	213	220464
3.	మంథని	117271	121820	17	155	239263
4.	ధర్మపురి	111962	117647	06	133	229748
5.	మంచిర్యాల	138472	140559	25	334	279390
6.	చెన్నూర్	95974	97264	07	134	193379
7.	బెల్లంపల్లి	86802	88530	13	163	175508
	మొత్తం	787140	805755	101	1396	1594392

నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

- జిల్లాలో 24 పరీక్ష కేంద్రాలు : నోడల్ అధికారి కల్పన



కల్పన

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 27 : జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన మంగళవారం వివరించారు. ఈనెల 28 నుంచి మార్చి 16 వరకు జరగనున్న ఇంటర్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని అన్నారు. జిల్లాలో 5213 మంది ఫస్ట్ ఇయర్ విద్యార్థులు, 5891మంది సెకండ్ ఇయర్ విద్యార్థులు మొత్తం 11,104 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరవుతున్నారని, వీరి కోసం 24 పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేశామని, వీటిలో 16 ప్రభుత్వ, 8 ప్రయివేటు జూనియర్ కళాశాలలు ఉన్నాయని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయని, ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు అనుమతించమని, ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు నియమించామన్నారు. పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించడానికి ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్, జిల్లా పరీక్షల కమిటీ బృందం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో అవసరమైన వసతులను సమకూర్చడం జరిగిందని, పరీక్షా కేంద్రాల్లో మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్ సౌకర్యం, సీసీ కెమెరాలు, ఫ్యాన్స్ లైట్స్ ఏర్పాటు చేశామని, ప్రతి పరీక్షా కేంద్రంలో ప్రశ్న పత్రాలను తెరిచే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు అమర్చడం జరిగిందని అన్నారు. విద్యార్థులు సులభంగా పరీక్ష కేంద్రాన్ని చేరుకోవడానికి సెంటర్ లోకేషన్ యాప్‌ని ఏర్పాటు చేశామని, ప్రయివేట్ యాజమాన్యాలు హాల్ టికెట్లను ఇవ్వని సందర్భంలో ఇంటర్మీడియట్ బోర్డు వెబ్‌సైట్లో హాల్ టికెట్లు ఉంచడం జరిగిందని, విద్యార్థులు వీటిని డౌన్లోడ్ చేసుకొని నేరుగా పరీక్షా కేంద్రానికి హాజరుకావచ్చని, వీటి పైన ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినా అనుమతిస్తారని అన్నారు. విద్యార్థులందరూ సకాలంలో అనగా 8గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకొని ప్రశాంతంగా పరీక్షలని రాయాలని పేర్కొన్నారు.

సింగిల్ విండో చైర్మన్‌గా సుమన్‌రెడ్డి ఎన్నిక



సుమన్‌రెడ్డికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న డీసీవో

ఓదెల, ఫిబ్రవరి 27 : మండలంలోని పొత్కపల్లి వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ వైస్‌చైర్మన్ ఎన్నికకు మంగళవారం తెరతీశారు. 20 రోజుల అనంతరం కార్యాలయంలో డీసీవో సమక్షంలో పోలీస్ భద్రత మధ్య ఏకగ్రీవ ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. చైర్మన్ పదవికి ఒకే నామినేషన్ దాఖలైనందున పొత్కపల్లికి చెందిన ఆళ్ల సుమన్‌రెడ్డిని చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కనగర్తికి చెందిన తాళ్లపల్లి సదయ్య వైస్‌చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అనంతరం డీసీవో చందుపట్ల శ్రీమాల ఎన్నిక ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. 20రోజులపాటు చైర్మన్ ఎవరనేది ఉత్కంఠంగా మారిన నేపథ్యంలో, ఎట్టకేలకు సొసైటీ కమిటీ ఎన్నిక ప్రక్రియ పూర్తి అయ్యింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, డైరెక్టర్ మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, డైరెక్టర్లు కట్కూరి కవిత, కాంతాల సమ్మిరెడ్డి, బొంగోని శ్రీనివాస్ గౌడ్, కోట విజయ, కొట్టే దేవేందర్,చింతం కుమారస్వామి, గూగుల్ పర్శరాం నాయక్, అలాగే సీఈవో గోలి అంజిరెడ్డి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ పాఠశాలలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలి

- ఉమ్మడి జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నతానియల్

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 27 : స్పోర్ట్స్ పాఠశాలలో 5వ తరగతి ప్రవేశం కోసం ఆసక్తి గల గిరిజన బాల, బాలికలు తమ దరఖాస్తులను జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, కరీంనగర్ కార్యాలయంలో సమర్పించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి పి.నతానియల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆసక్తిగల గిరిజన బాల, బాలికలు తమ దరఖాస్తులు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, కరీంనగర్ కార్యాలయ పనివేళల్లో సమర్పించాలని పేర్కొన్నారు. విద్యార్థుల వయస్సు 2024 ఆగస్టు 31నాటికి 9-11 సంవత్సరాలలోపు ఉండాలని, కరీంనగర్ జిల్లాలో మార్చి 4నుంచి 6 వరకు ఎంపిక ప్రక్రియ ఉంటుందని, వివరాలకు ఫోన్ నెంబర్ 9059175379లో సంప్రదించాలని పేర్కొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

- లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తం కావాలి - నేర సమీక్ష సమావేశంలో సీపీ శ్రీనివాస్



సమావేశానికి హాజరైన అధికారులు




మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, ఫిబ్రవరి 27: నేర పరిశోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని, సమగ్ర సాక్ష్యాధారాలతో చార్జిషీట్లు వేయాలని రామగుండం పోలీస్ కమిషనర్, ఐజీ ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం కమిషనరేట్‌లో నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని, పోక్సో, ఎస్‌సీ, ఎస్‌టీ అట్రాసిటీ కేసులు విచారణ పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతి కేసులో విచారణ పూర్తిగా పారదర్శకంగా జరుపాలని, సాంకేతిక పరిజ్ఞాన్ని వినియోగించుకుని శాస్త్రీయ ఆధారాలు సేకరించాలన్నారు. తద్వారా చట్ట పరిధిలో కోర్టుల్లో నేరస్థులకు శిక్షలు పడేలా చూడాలన్నారు. టెక్నాలజీ, ఫోరెనిక్స్ సైన్స్, శాస్త్రీయ ఆధారాలపై పట్టు సాధించాలన్నారు. ఇన్వెస్టిగేషన్‌లో ఎట్టి పరిస్థితుల్లో అలసత్వం ప్రదర్శించరాదన్నారు. ఎన్నికల్లో నమోదు అయిన కేసులను త్వరిగతిన పూర్తి చేయాలన్నారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన నిందితులను సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి అదుపులోకి తీసుకుని ఎన్‌బీడబ్ల్యూలను ఎగ్జిక్యూట్ చేయాలన్నారు. రాబోయే లోక్ సభ ఎన్నికులకు సిద్ధం కావాలని, పోలీసులందరూ ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణతో పని చేయాలన్నారు. పీడీఎస్ రైస్,నాటుసారా, గంజాయి తదితర నేరాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, పోలీస్ స్టేషన్ల వారీగా ఈ నేరాలకు పాల్పడే వారి జాబితాను సిద్ధం చేసుకోవాలన్నారు. ఆయా ఠాణాల పరిధిలో ఎస్‌హెచ్‌ఓలు సమాచార వ్యవస్థను పటిష్ఠపర్చుకోవాలన్నారు. ఏదైనా ఘనట జరిగితే వెంటనే సంఘటన స్థలానికి వెళ్లాలని, పరిస్థితులను అదుపులో ఉంచుకోవాలన్నారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్, హిస్టరీ షీట్లు ఉన్న వారిని బైండోవర్ చేయాలని ఆదేశించారు. సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక నిఘా పెట్టాలని, విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో గట్టి నిఘా పెట్టాలని, సానుభూతిపరులు, మాజీ మిలిటెంట్లకు కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘనటలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి డీసీపీ చేతన, మంచిర్యాల డీసీపీ సుధీర్ కేకన్, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, పెద్దపల్లి ఏసీపీ జీ కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, సీసీఎస్ ఏసీపీ భోజరాజు, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు పితృవియోగం

- పరామర్శించిన మాజీ మంత్రి కొప్పుల, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఈశ్వర్, ఇన్‌సెట్‌లో మల్లయ్య(ఫైల్),



నేత్రాలను సేకరిస్తున్న లయన్స్‌క్లబ్, సదాశయ ఫౌండేషన్ సభ్యులు

గోదావరిఖని, ఫిబ్రవరి 27: రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ తండ్రి మల్లయ్య(82) మంగళవారం ఉదయం మంచిర్యాలలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న మల్లయ్య మంగళవారం తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికకాయాన్ని తిలక్‌నగర్‌లోని కోరుకంటి చందర్ నివాసానికి తరలించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ మల్లయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మల్లయ్య పాడె మోశారు. గోదావరి వద్ద ఉన్న శ్మశాన వాటికలో మల్లయ్య అంత్రక్రియలు నిర్వహించారు. చందర్‌ను పలువురు కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పరామర్శించారు.

మల్లయ్య కళ్లు సజీవం..

అనారోగ్యంతో మృతిచెందిన మల్లయ్య కళ్లను కోరుకంటి చందర్ దానం చేశారు. చంద్రశేఖర్‌నగర్‌లోని తన నివాసంలో ఎల్‌వీ ప్రసాద్, సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్ రాజేంద్ర ప్రసాద్ మల్లయ్య కళ్లను సేకరించి హైదరాబాద్‌లోని ఐ బ్యాంకుకు తరలించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు తానిపర్తి విజయలక్ష్మి, కార్యదర్శి బంక కళావతి, ప్రతినిధులు రామస్వామి, రాజేందర్, బిక్షపతి, అన్నపూర్ణ, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు వాసు, చంద్రశేఖర్, శారద, శశికళ పాల్గొన్నారు.

శారదానగర్‌లో పోకిరీల బెడద

కోల్‌సిటీ, ఫిబ్రవరి 27: గోదావరిఖని శారదానగర్ సింగరేణి క్వార్టర్లలో రోజురోజుకు పోకిరీల బెడద ఎక్కువవుతోంది. చీకటి పడిందంటే మద్యం సేవించి ఆ దారిన ప్రభుత్వాసుపత్రికి వెళ్లే మహిళలను వేధిస్తున్నట్టు బాధితులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా సబ్ స్టేషన్ పక్క నుంచి క్వార్టర్ల గుండా ప్రభుత్వాసుపత్రికి వెళ్లే పాత దారిలో సాయంత్రం మద్యం సేవించి అసభ్యంగా ప్రవరిస్తున్నారని బాధితులు పేర్కొంటున్నారు. పెట్రోలింగ్ పెంచాలని, పోకిరీల ఆగడాలను అరికట్టాలని కోరుతున్నారు.

రామగుండంలో ఈఎస్‌ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలి

- డిప్యూటీ సీఎంకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ వినతి

జ్యోతినగర్, ఫిబ్రవరి 27 : రామగుండం ఎన్టీపీసీ ఏరియాలో ఈఎస్‌ఐ ఆసుపత్రిని నెలకొల్పాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎంకు మక్కాన్ సింగ్, స్థానిక నాయకులు మడిపెల్లి మల్లేష్, సయ్యద్ అహ్మద్ బాబాలు వినతిపత్రం అందజేశారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంతోపాటు చుట్టుపక్కల ఏరియాలో ఉన్న అసంఘటితరంగ కార్మికులకు మెరుగైన వైద్యసేవలు ఈఎస్‌ఐ ఆసుపత్రి వల్ల లభిస్తాయని, వేలాదిమంది కార్మికులకు లబ్ధి చేకూర్చేందుకు 66పడకల ఈఎస్‌ఐ(స్టేట్) ఆసుపత్రిని ఏర్పాటుచేయాలని వినతిపత్రంలో కోరారు. ఎన్టీపీసీలో ప్రస్తుతం ఈ ఎస్‌ఐ డిస్పెన్సరీ మాత్రమే ఉందని, ఈ డిస్పెన్సరీలో ఓపీ సేవలు మాత్రమే లభిస్తున్నాయని కార్మిక నాయకుడు అహ్మద్ బాబా తెలిపారు. అది కూడా ఒక్కడే డ్యూటీ డాక్టర్ ఉండడం వల్ల కార్మికులకు నామమాత్రంగానే వైద్యం అందుతోందని ఆవేదన వ్యక్తం చేశాడు. సిర్పూర్ కాగజ్‌నగర్‌లో ఉన్న ఈఎస్‌ఐ 66పడకల ఆసుపత్రిని హైదరాబాద్‌కు తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆ ఆసుపత్రిని రామగుండానికి తరలించాలన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో 36వేల మంది కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఈఎస్‌ఐ ఆసుపత్రి వల్ల ప్రయోజనం లభిస్తుందన్నారు. ఈఎస్‌ఐ ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు అహ్మద్ బాబా, మడిపెల్లి మల్లేష్ కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఆసుపత్రి ఏర్పాటు చేసేందుకు ఉప ముఖ్యమంత్రి సానుకూలత వ్యక్తం చేసినట్లు వారు పేర్కొన్నారు.

4న జడ్పీ సర్వసభ్య సమావేశం

పెద్దపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రామగుండంలోని ఎన్టీపీసీ మిలీనియం హాలులో మార్చి 4న మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో కె నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి గౌరవ సభ్యులు, ఆహ్వానితులు హాజరు కావాలని కోరారు. అలాగే అన్ని శాఖల జిల్లా అధికారులు శాఖాపరమైన పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆయన కోరారు.

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 27 : జిల్లాలోని సమస్త యాజమాన్యాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు బుధవారం జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి డి.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం జరిపే పాఠశాల స్థాయి పోటీలు, కార్యక్రమాల నివేదికలను ఫొటోలతో సహా శనివారంలోగా డీఈవో కార్యాలయంలో సబ్మిట్ చేయాలని తెలిపారు. మరింత సమాచారం కోసం జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావును 9951504622 సెల్ ఫోన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పెద్దపల్లి కల్చరల్ , ఫిబ్రవరి 27 : తెలంగాణ ఆంగ్ల భాష టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ విజార్డ్ పోటీల్లో పెద్దపల్లి జిల్లా విద్యార్థులు రెండవ స్థానంలో నిలిచినట్లు జిల్లా ఎల్టా అధ్యక్షుడు వంగ అశోక్ తెలిపారు. 33 జిల్లాల నుంచి జిల్లా పరిషత్, కేజీబీవి పాఠశాలలు వేరువేరుగా పోటీల్లో పాల్గొనగా జిల్లా పరిషత్ పాఠశాల నందిమేడారం పాఠశాలకు చెందిన జ్యోసిత (8వ తరగతి) పాఠశాలల విభాగంలో రెండవస్థానం, కేజీబీవీ విభాగంలో అంతర్గాంకు చెందిన అక్షర (8వ తరగతి విద్యార్థి) రెండవస్థానంలో నిలిచారు. ఈసందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాధికారి నారాయణరెడ్డి, ఎల్టా రాష్ట్ర అధ్యక్షుడు టివిరావు, కన్వీనర్ సంపత్‌లు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వంగ అశోక్, సెక్రెటరీ నాగరాజు,పెద్దపల్లి జిల్లా ఎల్టా సభ్యులు విద్యార్థులను, గైడ్ టీచర్‌లు రాజ్‌కుమార్, లతలను అభినందించారు.

లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో 2కే రన్



2కే రన్‌లో పాల్గొన్న విద్యార్థులు, బ్యాంకర్లు

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 27 : ఆర్థిక అక్షరాస్యత వారోత్సవంలో భాగంగా మంగళవారం పెద్దపల్లిలో 2కే రన్/వాక్ థాన్ నిర్వహించినట్లు లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్ తెలిపారు. అనంతరం పెద్దపల్లిలోని బాలికల హైస్కూల్‌లో బ్యాంకర్లు పాఠశాల విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌లు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఖని జనరల్ ఆసుపత్రిలో నీటి కటకట

- ఇబ్బందులు పడుతున్న రోగులు, సిబ్బంది

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 27: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వారంరోజులుగా నీటి కటకట నెలకొన్నది. సరిపడే ట్యాంకులు లేక వార్డులలో బాత్‌రూమ్‌లకు, ఇతర అవసరాలకు, తాగునీటికి కొరత ఏర్పడింది. ఆసుపత్రిలో బోర్ ద్వారా ట్యాంకుల్లో నీరు నింపాల్సి ఉండగా దాని నిర్వహణ సరిగా చేయకపోవడంతో సమయానికి నీరు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోగులు, వారి బంధువులు బాత్‌రూమ్‌కు వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అక్కడ ఉన్న నర్సులు, సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని వారి బంధువులు, రోగులు ఆరోపిస్తున్నారు. మంచినీటిని బయట కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. ప్రతి రోజు ఆసుపత్రిలోని ట్యాంకుల నీరు నింపాల్సి ఉండగా ట్యాంకుల్లో నీరు అయిపోయినా ఎవరికి చెప్పాలో తెలియని పరిస్థితి. ఆసుపత్రి నిర్వహణ గాలికి వదిలేయడంతో ఎవరు ఎక్కడ పని చేస్తున్నారనేది తెలియని పరిస్థితి ఉంది. కనీసం రోగులకు తాగునీటిని అందించలేని దుస్థితి నెలకొన్నది. ఉదయం అవసరాలకు నీరు లేకపోవడంతో రోగులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. మెడికల్ కళాశాల ఏర్పడిన తరువాత ఆసుపత్రికి ఇన్‌పేషెంట్ల తాకిడి పెరగడంతో గుక్కెడు నీళ్ల కోసం తిప్పలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆసుపత్రిలో ఇప్పటికైనా రోగులకు, వారి అటెండర్లకు సరిపడా నీటిని అందించాలని కోరుతున్నారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ, ఫిబ్రవరి 27: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం తమ ఇష్టదైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారు చేసి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం చెల్లించేందుకు భారీ సంఖ్యలో జనం తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా ఆలయ అధికారులు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.



బద్ది పోచమ్మ ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

ప్రజల బాగోగులు తెలుసుకునేందుకే బీజేపీ యాత్ర

తిమ్మాపూర్, ఫిబ్రవరి27: కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రజల బాగోగులు తెలుసుకోవడం కోసమే కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత యాత్ర చేపట్టారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మూగ జయశ్రీ అన్నారు. మానకొండూర్ నియోజకవర్గంలో మార్చి 2 నుంచి జరగబోయే యాత్రకు సంబంధించి తిమ్మాపూర్ మండల కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎంపి బండి సంజయ్ చేస్తున్న ప్రజాహిత యాత్రపై రాళ్ల దాడి చేసిన కాంగ్రెస్ నాయకుల చిల్లర బుద్ధులను ప్రజలు గమనిస్తున్నారని జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బండి సంజయ్ మాటలను వక్రీకరించి లబ్ధిపొందాలని చూస్తున్నారన్నారు.

రైల్వే ప్లాట్ ఫాంపై వ్యక్తి మృతి

జమ్మికుంట,ఫిబ్రవరి27: జమ్మికుంట రైల్వేస్టేషన్ మొదటి ప్లాట్‌ఫాంపై ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృత్యువాత పడ్డాడు.రామగుండం రైల్వేహెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవని ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించిన ఔట్‌పేషెంట్ చీటి ఉందని అందులో అతడి పేరు సాగర్ తండ్రి జితేందర్ అని ఉన్నట్లు తెలిపారు. అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. మృతుడి వయస్సు 50 సంవత్సరాలు ఉంటాయని తెలిపారు. బ్లూ కలర్ ఫుల్ షర్ట్ దానిపై పసుపు రంగు నిలువు గీతల డిజైన్ బ్లాక్ లోయర్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ మాట తప్పింది

- ఫీజు లేకుండా క్రమబద్ధీకరించాలి
- తాగునీటిలోనూ లాభం వెతుకుతారా?
- ఇలాంటి వ్యక్తి సీఎం కావడం దురదృష్టకరం
- ప్రభుత్వమంటే రియల్ వ్యాపారం కాదు: హరీశ్



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేస్తామని, ఉచితంగా స్థలాలను క్రమబద్ధీకరిస్తాం అంటూ ప్రజలను రెచ్చగొట్టిన కాంగ్రెస్.. ఇపుడు మాట తప్పి ఫీజు వసూలు చేసేందుకు సిద్ధమైందని మాజీ మంత్రి టి.హరీశ్ రావు ఆరోపించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని, లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని.. ఇది వారి మోసపూరిత విధానాలకు నిదర్శనమని విమర్శించారు. ఆ పార్టీ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. గతంలో చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఎల్ఆర్ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు..ప్రజలకు అందించే స్వచ్ఛమైన తాగునీటిలోనూ లాభం వెతుకుతారా..? మిషన్ భగీరథ పథకంలో లాభం వెతికే వ్యక్తి ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టమని హరీశ్‌రావు పేర్కొన్నారు. భగీరథ ద్వారా ఏం లాభం తెచ్చారని.. దానికోసం తెచ్చిన అప్పుపై వడ్డీ ఎలా కడతారని ఆయన ప్రశ్నించడం అంతకన్నా దౌర్భాగ్యం, భావదారిద్ర్య ఆరోపణ మరొకటి ఉండద మంగళవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు.. ప్రజా సంక్షేమంలో లాభనష్టాలు చూసుకోరని రేవంత్‌రెడ్డిపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మిషన్ భగీరథ పథకాన్ని ప్రజల ఆరోగ్యం కాపాడిన గొప్ప సంజీవనిగా చూడాలని.. అందులో లాభనష్టాలు బేరీజు వేసుకోవడం ఒక ప్రభుత్వాధినేతకు తగదని హితవుపలికారు. ఆసరా పెన్షన్ల ద్వారా కూడా రూ.వేలకోట్లు ఖర్చవుతుంది. దాని వల్ల కూడా లాభం లేదంటారా..? అని ప్రశ్నించారు.

మీ ఎత్తు గురించి నేను మాట్లాడితే..!

'ఇటీవల పలు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిసారి నా ఎత్తు గురించి వ్యాఖ్యానిస్తున్నారు. నేను కూడా మీ (సీఎం రేవంత్‌ను ఉద్దేశించి) ఎత్తు గురించి మాట్లాడితే సంస్కారవంతంగా ఉండదు. ఎవరి ఎత్తు ఎంత అనేది ప్రజలకు అవసరం లేదు. ప్రజల కోసం ఎవరు ఎంతమేరకు ఆలోచిస్తున్నారో.. ఎవరెంత పనిచేస్తున్నారో.. మాత్రమే వారికి అవసరం' అని హరీశ్‌రావు వెల్లడించారు.

కాంగ్రెస్ వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామన్నారు కదా?: టీఆర్ఏ

ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రితోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని ప్రకటనలు చేశారని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ (టీఆర్ఏ) అధ్యక్షుడు నారగోని ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. "గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ కింద రుసుము వసూలుకు ప్రతిపాదనలు చేస్తే.. లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్ లాగే మ్యారేజ్ రెగ్యులేషన్ స్కీమ్ కూడా తీసుకొస్తారేమో అని గతంలో రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇప్పుడేమో సీఎం హోదాలో అదే పథకాన్ని అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎల్ఆర్ఎస్ రద్దు చేయాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేయగా గతంలో కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఇప్పుడు ఇదే ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ తెరమీదకు తెచ్చి మార్చి 31లోగా గడువు విధించి రెగ్యులరైజేషన్ చేయించుకోవాలని చెప్పడం సమంజసంగా లేదు" అని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తెలంగాణలో 17 సీట్లూ బీజేపీ గెలవాలి

హైదరాబాద్ సీటును కూడా కైవసం చేసుకోవాలి.. అసదుద్దీన్ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలి

- విజయ సంకల్ప యాత్రలో కిషన్‌రెడ్డి



విజయ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

హైదరాబాద్ సిటీ/కార్వాన్/నిజామాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ గెలవాలని, మజ్లిస్ సీటును కూడా కైవసం చేసుకుని అసదుద్దీన్ ఒవైసీ పార్లమెంటుకు వెళ్ళకుండా అడ్డుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాసామ్యానికి, అభివృద్ధికి వ్యతిరేకంగా మజ్లిస్ పార్టీ పనిచేస్తుందని, మెట్రో రైలు ప్రాజెక్టును అడ్డుకుంటుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే దాని పంచన చేరి పోలీసు వ్యవస్థను తన ఆధీనంలో పెట్టుకుంటుందని విమర్శించారు. మంగళవారం కిషన్ రెడ్డి హైదరాబాద్‌లో రెండో రోజు విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. గుడిమల్కాపూర్ జైన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్వాన్, గోషామహల్, చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో యాత్ర కొనసాగింది. జుమ్మేరాత్ బజార్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీకి ముఖ్యంగా హైదరాబాద్ లోక్‌సభ సీటు గెలవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో 12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని, మోదీ ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రపంచంలో భారతదేశ ప్రతిష్ఠను పెంచారన్నారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ, 114 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 5500 కిలోమీటర్ల మేర ఐదు విజయ సంకల్ప యాత్రలు కొనసాగుతాయని తెలిపారు. వచ్చే నెల 2వ తేదీతో ముగుస్తాయన్నారు. మోదీ మళ్లీ ప్రధాని కావాలని ఈ యాత్రలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కాగా, నిజామాబాద్ జిల్లా బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో జరిగిన యాత్రలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొన్నారు. కేంద్రంలో మూడోసారీ బీజేపీయే అధికారంలోకి వస్తుందని, మోదీ మళ్లీ ప్రధాని అవుతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మోదీ రైతుల కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేసి హామీ నెరవేర్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ నామమాత్ర మెజారిటీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పటికీ ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్‌కు ఆదరణ లేదని, కేంద్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడం కలేనని వ్యాఖ్యానించారు.

తల్లిని అడ్డుపెట్టుకొని రాజకీయాలు

పొన్నం తల్లిని నేను అవమానించలేదు.. యాత్రను ఆపేయాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టం

- హామీల అమలును ప్రశ్నిస్తే దాడులా?
- నేను ఓడిపోతే.. రాజకీయ సన్యాసం
- కాంగ్రెస్ ఓడితే పొన్నం తప్పుకుంటారా?
- కేటీఆర్‌తో బీఆర్ఎస్..

పొన్నంతో కాంగ్రెస్ నాశనం: సంజయ్



ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 27: కన్న తల్లిని అడ్డుపెట్టుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ రాజకీయం చేయాలనుకుంటున్నాడని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. 'రాముడు అయోధ్యలోనే పుట్టాడా..?' అని అడిగిన వారిని ప్రశ్నించాను తప్ప.. పొన్నం తల్లిని ఉద్దేశించి అనలేదని వివరణ ఇచ్చారు. అందరు తల్లులు తన తల్లితో సమానమని.. ప్రభాకర్ తల్లిని తాను అవమానించలేదని స్పష్టం చేశారు. తాను అంత సంస్కారహీనుడిని కానని అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేలోగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే.. అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. హామీల అమలుకు ఇంకా 20 రోజులే గడువు ఉందన్నారు. రేషన్ కార్డులు ఉన్న వారికే పథకాలు ఇస్తామని చెబుతున్నారని.. రేషన్ కార్డులు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. తాను హామీల అమలును ప్రశ్నిస్తే.. కాంగ్రెస్ దాడులు చేయించడం ఏంటని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ ఏమీ చేయలేదు కాబట్టే గత ఎంపీ ఎన్నికల్లో మూడో స్థానం వచ్చిందని తెలిపారు. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యం అని ఆయన అన్నది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. ప్రజాహిత యాత్రను ఆపాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టమని హెచ్చరించారు. కేసీఆర్ పదేళ్లలో రూ.5 లక్షల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ 2 నెలల్లో రూ.10వేల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. తల్లిని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నందుకు స్వర్గంలో ఉన్న పొన్నం తల్లి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని సంజయ్ అన్నారు. అయితే, పక్కనే ఉన్న నాయకులు పొన్నం తల్లి బతికే ఉందని.. తండ్రి చనిపోయాడని తెలిపారు. దీంతో పొరపాటును గుర్తించిన సంజయ్.. పొన్నం తండ్రి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని అన్నారు. ఆయన తల్లి నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. 'రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రికి సవాల్ విసురుతున్నా.. నేను నా విశ్వాసాలతో రాముడి పేరిట ఎంపీ ఎన్నికల్లో నిలుచుంటా. నువ్వు నీ వాదనతో అభ్యర్థిని నిలబెట్టు. నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా. మళ్లీ రాముడని, హిందూ మతమని మాట్లాడను. మీ అభ్యర్థి ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటావా..?' అని బండి సంజయ్ పేర్కొన్నారు. కేటీఆర్‌తో బీఆర్ఎస్ నాశనమైందని, పొన్నం లాంటి వారితో కాంగ్రెస్ నాశనమవుతుందని పేర్కొన్నారు. 'కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తుంటే మీ ఫొటోలు పెట్టుకుంటారా.. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా బియ్యం ఇస్తోందని, ఇక్కడికి బియ్యం పంపవద్దని ప్రధాని మోదీకి లేఖ రాస్తా' అని అన్నారు.

సంజయ్ క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ శ్రేణుల డిమాండ్

పాదయాత్ర శిబిరాన్ని ముట్టడించే యత్నం

చిగురుమామిడి/హుస్నాబాద్ రూరల్: సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర మంగళవారం ఉద్రిక్త వాతావరణంలో సాగింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని హుస్నాబాద్ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. సంజయ్ ప్రజాహిత యాత్రను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో సోమవారం రాత్రి సంజయ్ బస చేశారు. మంగళవారం ఉదయం అక్కడికి తరలి వచ్చిన కాంగ్రెస్ నాయకులు సంజయ్ బస చేసిన శిబిరాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. అక్కడ ఉన్న బీజేపీ నాయకులు వారిని ప్రతిఘటించారు. పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. దీంతో ఉల్లంపల్లి శివారులోని ప్రధాన రహదారిపై కాంగ్రెస్ కార్యకర్తలు బైఠాయించారు. కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కరీంనగర్ జిల్లా సరిహద్దు నుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని రాములపల్లి వరకు పాదయాత్రను పోలీస్ బందో బస్తుతో తీసుకెళ్లారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. కరీంనగర్‌లో రాస్తారోకో చేశారు. పలుచోట్ల సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎంపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాహిత యాత్ర మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి వస్తున్న క్రమంలో సంజయ్‌కి స్వాగతం పలుకుతూ బీజేపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై కాంగ్రెస్ కార్యకర్తలు అనుచిత రాతలు రాశారు. దీనిపై బీజేపీ నేతలు ముల్కనూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యాత్ర పేరిట 'బండి' రాజకీయ డ్రామాలు

- నా తల్లిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు
- ఎంపీగా అయిదేళ్లలో ఏం చేశారో చెప్పాలి
- సంజయ్ ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడు : మంత్రి పొన్నం



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి)/హుస్నాబాద్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రాజకీయ డ్రామాలతో ప్రజాహిత యాత్ర చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన గాంధీ భవన్‌లో, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తన తల్లిపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఎంపీగా ఐదేళ్ల పదవీ కాలంలో సంజయ్ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నిస్తే.. ఆయన తన తల్లి జన్మకు సంబంధించి వ్యాఖ్యలు చేశారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం ప్రచారం కోసమే సంజయ్ తన యాత్రను కాంగ్రెస్ అడ్డుకున్నట్లు డ్రామాలకు తెరలేపారన్నారు. తాము వాళ్ల యాత్రలు అడ్డుకోవడం లేదని, ప్రజాస్వామ్యంలో యాత్ర చేసే హక్కు అందరికీ ఉంటుందని, కానీ అవివేకమైన మాటలు సరికాదని విమర్శించారు. తనకు శ్రీరాముడు అంటే గౌరవం అని, ఏనాడు శ్రీరాముడి గురించి కాని, అక్షింతల గురించి గాని మాట్లాడలేదని, ఒకవేళ మాట్లాడినట్లు నిరూపిస్తే సజీవ సమాధికి సిద్ధమని సవాల్ విసిరారు. తన మాటలను వక్రీకరించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. శ్రీరాముని పేరు మీద ఓట్లు అడగడం కాదు.. అయిదేళ్ల కాలంలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సంజయ్ వ్యాఖ్యలపై బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు ఆలోచించాలన్నారు. ఇలాంటి నాయకుని డ్రామాలను సమర్థిస్తున్నారా..? అని ప్రశ్నించారు. సంజయ్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని మంత్రి హెచ్చరించారు.

నకిలీ డాక్యుమెంట్ల కేసులో మరొకరి అరెస్టు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 27: నకిలీ డాక్యుమెంట్లతో భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన కేసులో చిట్యాల కిష్టమ్మ(75)ను మంగళవారం అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో జైలుకు తరలించినట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. ఈ నెల 20న కొత్తపల్లికి చెందిన కనుకారెడ్డి ఫిర్యాదుతో నందెల్లి మహిపాల్‌తో పాటు 9 మందిపై నమోదైన కేసులో ఏ1 కిష్టమ్మను అరెస్టు చేశామని తెలిపారు.

హెచ్ఐవీ బాధితులకు చేయూత అందించాలి

● రాష్ట్ర ఏయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ హైమావతి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 27: హెచ్ఐవీ బాధితులకు చేయూత అందించాలని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ హైమావతి అన్నారు. కుటుంబ సభ్యులు, పిల్లలకు ఇండెక్స్ పరీక్షలు నిర్వహించాలని ఆమె సూచించారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జాతీయ ఏయిడ్స్ నియంత్రణ సంస్థ విభాగాల డాక్టర్లతో పాటు కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలకు చెందిన ఐసీటీ, పీపీటీసీటీ, డీఎస్ఆర్‌సీ, ఏఆర్‌టీ కేంద్రాల కౌన్సిలర్లు, డాక్టర్లు, ఎన్‌జీవో ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. రిస్క్ గ్రూపు వారిని గుర్తించి, ఏఆర్‌టీ మందులను సక్రమంగా అందించాలని సూచించారు. ఎస్‌పీసీసీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులకు సైతం అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీ సాక్స్ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్, జాయింట్ డైరెక్టర్లు కరుణశ్రీ, మేఖల, అసిస్టెంట్ డైరెక్టర్ ఇందిరా, సేతు మాధవ్, కన్సల్టెంట్ డాక్టర్లు డాక్టర్ పార్థసారధి, డాక్టర్ లేహార్‌వాణి, డీటీసీవో డాక్టర్ రవిందర్‌రెడ్డి, డీఏపీసీయూ మేనేజర్ సురేందర్‌రెడ్డి, పీఆర్ శ్రీనివాస్, సురేందర్, సుమన్, రమేశ్, శ్రీనివాస్, ఎన్‌జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులో ఒకరి రిమాండ్

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), ఫిబ్రవరి 27: భూమి కొనుగోలు విషయంలో తప్పించుకొని తిరగడంతో పాటు కులం పేరుతో దూషించిన సంఘటనలో గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామానికి చెందిన నర విద్యాసాగర్ రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఈ ఘటనపై మంగళవారం డీఎస్పీ భీమ్‌శర్మ విచారణ చేపట్టారు. ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన భూక్య నరేష్ నాగంపేటకు చెందిన విద్యాసాగర్‌రెడ్డి దగ్గర రూ.47 లక్షలకు భూమి కొనుగోలు చేసి 15 లక్షలు చెల్లించారు. నరేష్ మిగతా డబ్బులు చెల్లించేందుకు విద్యాసాగర్ రెడ్డికి ఫోన్ చేసినా స్పందించకుండా తప్పించుకొని తిరగడంతో సోమవారం కనిపించాడు. నరేష్ మిగతా డబ్బులు చెల్లిస్తా నా భూమి ఎక్కడ ఉందో చూపించమంటూ అడగడంతో కులం పేరుతో విద్యాసాగర్‌రెడ్డి ఆయనను దూషించారు. కులం పేరుతో దూషించడంతో నరేష్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై ఫిర్యాదు చేశారు. నరేష్ ఫిర్యాదుతో కులం పేరుతో దూషించిన విద్యాసాగర్‌రెడ్డిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో సింగరేణి కార్మికుడు మృతి

కోల్‌సిటీ, ఫిబ్రవరి 27: గోదావరిఖని పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలోని డ్రైన్‌లో మంగళవారం రాత్రి పూరెళ్లి సాగర్(35) అనే వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానిక మిలీనియం క్వార్టర్స్‌లో నివాసముండే సాగర్ జీడీకే 1ఇంక్లైన్‌లో పనిచేస్తున్నాడు. అనారోగ్య కారణాలతో సింగరేణి ఆసుపత్రిలో చేరిన ఆయన శుక్రవారం నుంచి కనబడడం లేదని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. కొంత కాలంగా కుటుంబ వివాదాలతో భార్య కాపురానికి రావడం లేదు. మృతదేహంపై పలు చోట్ల గాయాలున్నాయి. వన్‌టౌన్ పోలీసులు సమీపంలోని సీసీ పుటేజీలను పరిశీలించారు.

రెండు రోజుల క్రితం సాగర్ నడుచుకుంటూ వచ్చినట్లు పుటేజీ లభించింది. కాగా సాగర్ తల్లి అమ్మాయి తన కుమారుడి మృతిపై అనుమానాలున్నాయని, అతని మృతిలో భార్య, అత్తంటి వారి ప్రమేయం ఉన్నట్టు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వన్‌టౌన్ ఎస్ఐ సమ్మయ్య ఘటన స్థలంలో పరిశీలన జరిపారు.

మహాశివరాత్రి జాతర ఏర్పాట్లలో వేగం పెంచాలి

● సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

వేములవాడ, ఫిబ్రవరి 27: మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో మార్చి 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర మహోత్సవాల ఏర్పాట్లను ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 3 షిఫ్టుల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలని, తాత్కాలిక పార్కింగ్ లాట్స్‌ను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని అన్నారు. శివ భక్తుల కోసం సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. నిర్దేశించుకున్న ప్రకారం జాతర ప్రారంభ సమయానికి పనులు పూర్తి చేయాలని, ఆయా శాఖలకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. గత అనుభవాల దృష్ట్యా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఆలయ ప్రాంగణం, జాతర పరిసరాలను నిరంతరం శుభ్రం చేయించాలన్నారు. మానిటరింగ్‌కు సెక్టార్ల వారీగా సంబంధిత అధికారులను నియమించాలని, మున్సిపల్, టెంపుల్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల ద్వారా పారిశుధ్య కార్యక్రమాలు పర్యవేక్షించాలని ఆదేశించారు. జాతర సందర్భంగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించాలన్నారు. అవసరం మేరకు టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, దేవస్థానం క్యూలైన్లు, పరిసర ప్రాంతాల్లో రెస్క్యూ బృందాలను అందుబాటులో ఉంచాలని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా భక్తులకు తాగునీటి వసతి కల్పించాలని, ప్రతీ 100 మీటర్లకు తాగునీటి ట్యాపులను ఏర్పాటు చేయాలని సూచించారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని, జాతర ప్రాంగణ మొత్తం సీసీ కెమెరాలు ఉండేలా చూడాలని అన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పార్కింగ్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి అన్సారీ, మున్సిపల్ కమీషనర్ అన్వేష్, ఆలయ ఈఈ రాజేష్, ఏఈవో జయ కుమారి, టౌన్ సీఐ కరుణాకర్ పాల్గొన్నారు.

● జాతర ఏర్పాట్లపై నేడు సమీక్ష

వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై బుధవారం సమీక్ష నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

భూమి నకిలీ పత్రాలు సృష్టించిన ఇద్దరిపై కేసు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 27: తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌పరిధిలో భూమి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జాలు పాల్పడుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. తంగళ్లపల్లి మండలంలోని లక్ష్మీపూర్ శివారులో 45 సంవత్సరాల క్రితం గుర్రం అంజయ్య కొనుగోలు చేసిన భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఈ భూమిని తంగళ్లపల్లికి చెందిన కోడి అంతయ్య ఆక్రమించాలనే ఉద్దేశంతో గుర్రం అంజయ్యను అతడి కుటుంబ సభ్యులను బెదిరించి భూమి కబ్జా చేశాడు. తంగళ్లపల్లి శివారులోని శోభ భూమిలోకి సైతం అక్రమంగా ప్రవేశించినందుకు అతడిపై మరో కేసు నమోదు చేశామని ఎస్పీ వెల్లడించారు. అదే విధంగా తంగళ్లపల్లి మండలంలోని అంకుసాపూర్ సర్వే నంబర్ 160లో రెండు గంటల భూమి తన పేరున లేకపోయినా ఉన్నదని నమ్మించి చిలుక శ్రీనివాస్ అనే వ్యక్తితో ఒప్పందం చేసుకొని అతని వద్ద నుంచి రూ .8.40 లక్షలు తీసుకున్న వట్టిమల్ల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామన్నారు. భూ కబ్జాలకు సంబంధించి ప్రజలు ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ అన్నారు. జిల్లాలో భూ కబ్జాలు చేస్తూ, భూమి నకిలీ పత్రాలు సృష్టించి బెదిరింపులకు పాల్పడే వారి సమాచారం ఇవ్వాలన్నారు.

దేవుడి పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీ



మాట్లాడుతున్న గజ్జెల కాంతం

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 27: బీజేపీ దేవుడి పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతూ మత రాజకీయాలు చేస్తూ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నదని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కుల సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం విమర్శించారు. డీసీసీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎంపీ బండి సంజయ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు సహించరానివన్నారు. బండి సంజయ్ మతి స్థిమితం లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. ఈ సారి బండి సంజయ్‌కి పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్ కూడా రాదన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు గెలుచుకుంటుందన్నారు. బండి సంజయ్ ఎంపీగా గెలిచిన తరువాత ఇప్పటి వరకు కేంద్రం నుంచి ప్రత్యేకంగా ఒక్క రూపాయి నిధులు తీసుకురాలేదని విమర్శించారు. రాముడు దేశ ప్రజలందరి ఆరాధ్య దేవుడన్నారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే కాగ్ రిపోర్ట్‌లో గత రాష్ట్ర ప్రభుత్వంలో రూ.3 లక్షల కోట్లు అవినీతిపై సీబీఐ, ఈడీ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్‌తో లోపాయికారి ఒప్పందంతోనే లిక్కర్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కవితను అరెస్టు చేయటం లేదన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, కవితల అవినీతిపై విచారణ జరపాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల సందడి



అంజన్న ఆలయం వద్ద భక్తులు

మల్యాల, ఫిబ్రవరి 27: కొండగట్టు అంజన్న క్షేత్రం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. అంజన్న దర్శనం అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. సమ్మక్క సారక్క భక్తుల రద్దీ దృష్ట్యా నిలిపి వేసిన వాహనపూజలు, అభిషేకాలు పునరుద్ధరించారు.

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), ఫిబ్రవరి 27 : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన నిమ్మల రాజు (44) బెహరన్ దేశంలో మృతి చెందగా మంగళవారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. నిమ్మల రాజు గత పదేళ్లుగా బెహరన్ వెళ్తున్నాడు. అక్కడ ఓ కంపనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాజు గుండెపోటుతో మృతి చెందాడు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ

చొప్పదండి, ఫిబ్రవరి 27: చొప్పదండి జెడ్‌పి బాలుర పాఠశాలకు చెందిన 13 మంది బాలికలకు ఉమెన్స్ డెవలెప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ మంగళవారం సైకిళ్లను పంపిణీ చేసింది. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు జమున, ప్రవీణ్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి, పీడి కృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



కమలాకర్ (ఫైల్)

బోయినపల్లి, ఫిబ్రవరి 27: బోయినపల్లి మండలంలో ద్విచక్రవాహనాన్ని లారీ అతివేగంగా ఢీకొనడంతో గంగాధర మండలం పిట్టలపల్లికి చెందిన గోదాల కమలాకర్ (45) మంగళవారం అక్కడిక్కడే మృతి చెందాడు. ఎస్ఐ శ్రీకాంత్ వివరాల ప్రకారం.. గంగాధర మండలం పిట్టలపల్లి గ్రామానికి చెందిన కమలాకర్ కోర్టు కేసు నిమిత్తం వేములవాడకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. బోయినపల్లి మార్కెట్ యార్డు సమీపాన ఇటుక బట్టీల యజమానులు డంప్ చేసిన మట్టి నిల్వలను తరలించేందుకు లారీ వస్తోంది. లారీ డ్రైవర్ వాహనాన్ని అతి వేగంగా కమలాకర్ ద్విచక్ర వాహనాన్ని వెనక వైపు నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కమలాకర్ లారీ కింద పడి అక్కడిక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకొని లారీ డ్రైవర్‌ను అరెస్ట్ చేయాలని రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకోని మృతుని కుటుంబసభ్యులను ఆందోళనను విరమింప జేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తి సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చుసుకోని ధర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మానసాదేవి ప్రతిష్ఠాపన మహోత్సవం



ఉత్సవాలలో పాల్గొన్న భక్తులు, వేదపండితులు

కోరుట్ల, ఫిబ్రవరి 27: పట్టణంలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం మానసాదేవి ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితులు పాలెపు రామకృష్ణ శర్మ మంత్రోశ్ఛరణ మధ్య ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని జరిపారు. ఈ సందర్భంగా దేవాలయ ఆవరణలో ఉన్న పాము పుట్ట వద్ద నాగేంద్ర సహిత మానసాదేవి ప్రతిష్ఠాపన జరిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం కార్యక్రమాలను నిర్వహించి ఉత్సవమూర్తుల శోభాయాత్ర నిర్వహించారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కొప్పుల ఈశ్వర్, దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 27 : మండలంలోని కాపులపల్లి గ్రామంలో పోచమ్మ తల్లితో పాటు గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో భూలక్ష్మీ, మహాలక్ష్మీ, పోతురాజు, బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రత్యేక హోమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ గోపు కవిత-శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ అశోక్ పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 27: మండలంలోని పందిళ్ల గ్రామంలో ఇటీవల ఇల్లందుల శ్రీనివాస్ అనారోగ్యంతో మృతిచెందగా అతడి కుటుంబానికి ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా మంజూరైంది. సోమవారం ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ కొట్టె శ్రీనివాస్ శ్రీనివాస్ భార్య వాసవికి బీమా రూ.2లక్షల చెక్కుతోపాటు గ్రామీణ తపాలా జీవిత బీమా రూ.30,600 చెక్కును అందజేశారు. మేనేజర్ మోహన్‌సాయి, మాజీ సర్పంచ్ అటికం శంకరయ్య, బ్రాంచ్ పోస్టుమాస్టర్ వెలిశాల శ్రీనివాస్, ముత్తయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ధర్మారం,ఫిబ్రవరి27: మండలంలోని బొట్లవనపర్తి గ్రామానికి చెందిన తూడి శంకర్(43) ఆత్మహత్యాయత్నానికి పాల్పడి కరీంనగర్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడని ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఈనెల 23న గ్రామంలోని తన పొలం వద్ద తాగిన మైకంలో పురుగుల మందు సేవించాడు. అతనిని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. మంగళవారం శంకర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్సై సత్యనారాయణ తెలిపారు. మద్యానికి బానిసై అదేమత్తులో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సుదర్శన క్రియ యోగా సాధనపై శిక్షణ

మంథని, ఫిబ్రవరి 27: స్థానిక శ్రీజానకిరామ కల్యాణ వేదికలో సుదర్శన క్రియ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో న్యూయార్క్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్‌లో బోధకుడిగా వ్యవహరిస్తున్న శ్రవణ్ భరతుల, దుద్దిళ్ల గణపతి, సాధకులు పాల్గొన్నారు.

గోలివాడ సమ్మక్క జాతర హుండీ లెక్కింపు

అంతర్గాం, ఫిబ్రవరి 27: అంతర్గాం మండల పరిధిలోని గోలివాడలో మంగళవారం సమ్మక్క జాతర హుండీ లెక్కింపును దేవదాయశాఖ అధికారులు, జాతర కమిటీ సభ్యులు నిర్వహించారు. జాతరలో అమ్మవారికి కానుకల రూపంలో వచ్చిన బంగారు, వెండి, నగదును గోలివాడ శ్రీ కోదండ రామాలయంలో లెక్కించారు. రూ.10,36,780 నగదు, 500గ్రాముల వెండి, గ్రాము బంగారం వచ్చినట్టు దేవాలయశాఖ ఈవో రాజ్‌కుమార్ తెలిపారు. జాతర హుండీ ఆదాయంను ప్రభుత్వ ఖజానలో జమ చేయనున్నట్టు ఈఓ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుజాత, తహసీల్దార్ పీ రాంమోహన్, జాతర కమిటీ చైర్మన్ పెండ్రు హనుమాన్‌రెడ్డి, సభ్యులు ఆవుల గోపాల్‌యాదవ్, కోల రాంమూర్తిగౌడ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొలనూర్ జాతర ఆదాయం రూ.7.78 లక్షలు



కొలనూర్‌లో హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న భక్తులు

ఓదెల, ఫిబ్రవరి 27 : మండలంలోని కొలనూర్ గుట్టల్లో ఇటీవల నిర్వహించిన వనదేవతల జాతర ఆదాయం రూ.7.78 లక్షల 476 రుపాయలు సమకూరాయి. ఈనెల 21 నుంచి 23 వరకు సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహించగా కొలనూర్ గ్రామ పంచాయితి కార్యాలయంలో మంగళవారం 8 హుండీలను విప్పి లెక్కింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి కార్యనిర్వహణ అధికారి సదయ్య, జాతర కమిటి చైర్మన్ దేవిడి శ్యాం రెడ్డి, మల్లన్న ఆలయ జూనియర్ అసిస్టెంట్ ముద్దసాని కుమారస్వామి, అలాగే భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి శోభాయాత్ర

మంథని, ఫిబ్రవరి 27: స్థానిక శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ప్రత్యేక పూజాకార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం గోదావరిలో స్వామి ఉత్సవ విగ్రహానికి భక్తులు చక్రస్నానం చేయించారు. ఆలయంలోని స్వామి మూలవిరాట్‌కు పంచామృతాలు, వివిధ రకాల పూలు, సుగంధద్రవ్యాలు, పసుపు, కుంకుమలతో కన్నుల పండువగా అభిషేకాన్ని నిర్వహించారు. ఆలయ ఆవరణలోని శ్రీగణపతి, శ్రీసుబ్రమణ్యేశ్వర, శ్రీమహాశివుడు, శ్రీమహావిష్ణువు, శ్రీసరస్వతీమాతా, శ్రీహనుమాన్ ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా స్వామి శరణుగోషతో భక్తులు నినాదాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాలను వితరణ చేశారు. సాయంత్రం రథంపై స్వామి ఉత్సవాన్ని విగ్రహాన్ని ఉంచి శోభయాత్రను నిర్వహించారు. మహిళల కోలాట బృందాలు, అయ్యప్ప డీజే పాటలకు భక్తుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శోభయాత్రలో స్వామి పట్టణ ప్రజలు దర్శించుకొ ని, మంగళహారతులతో స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. ఆలయంలో రాత్రి ప్రత్యేక భజనా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమా ల్లో ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్జీ-3 క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న జీఎం

రామగిరి, ఫిబ్రవరి 27: సింగరేణి సంస్థ ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు ముఖ్యఅతిథిగా హజరై క్రీడాకారులకు క్రీడాదుస్తులను పంపిణి చేపట్టారు. 2022-23 ఏరియా స్థాయిలో నిర్వహించిన వర్క్‌పిపుల్స్ అండ్ స్పోర్ట్స్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడపోటిల్లో ప్రతిభ కనబరిచిన వివిధ గనులు డిపార్ట్‌మెంట్ క్రిడకారులకు జీఎం దుస్తులు పంపిణి చేపట్టారు. కొల్‌ఇండియా స్థాయిలో ప్రతిభ చూపాలను కొరారు. ఈ కార్యక్రమంలో అదికారుల సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, అదికారులు రఘుపతి, రవీందర్‌రెడ్డి, సునీల్‌ప్రసాద్ గుర్రం శ్రీహరి, నాయకులు కొటరవీందర్‌రెడ్డి, ఎంఆర్‌సీరెడ్డి, స్పోర్ట్స్ కొ-ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ధర్మారంలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 27: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రామగుండం, ఎన్‌టీపీసీ, గోదావరిఖని ప్రాంతాల్లో మొత్తం ఏడు పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రామగుండంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎన్‌టీపీసీలో సచ్‌దేవ జూనియర్ కళాశాల, గోదావరిఖనిలో ప్రభుత్వ బాలుర కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, గాంధీ జూనియర్ కళాశాల, కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల, కాకతీయ జూనియర్ కళాశాలలో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 1593మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 1688మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, పకడ్బందీగా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

ధర్మారం, ఫిబ్రవరి 27: ఇంటర్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల కేంద్రంలో ఆదర్శ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఆదర్శ కళాశాలలో 308 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 371మంది ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు రాయనున్నారు. గురువారం జరిగే ఇంటర్ ద్వితీయ పరీక్షలకు ఆదర్శ కళాశాలలో 293మంది విద్యార్థులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 386మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకు మంగళవారం రెండు పరీక్ష కేంద్రాల్లోని తరగతి గదుల్లో విద్యార్థుల హాల్‌టికెట్ నంబర్లను వేశారు. ఆదర్శ కళాశాల పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్‌గా దీనాకుమారి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా వెంకటేశం, ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్‌గా కరుణాకర్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా అశోక్‌రెడ్డిలతో పాటు ఇన్విజిలేటర్లను నియమించారు.

మంథని, ఫిబ్రవరి 27: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మంథనిలో ప్రభుత్వ బాలికలు, బాలుర కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వ బాలికల, బాలుర, గిరిజన, సాంఘిక సంక్షేమ కళాశాలల విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. బుధవారం జరగనున్న ప్రథమ సంవత్సర మొదటి భాష పరీక్షల్లో బాలికల కళాశాలలో 201 మంది, బాలుర కళాశాలలో 176మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ పరీక్షల కు నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదని, 30 నిమిషాలు ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని బాలికల కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ సయ్యద్ సలీం తెలిపారు.

వాహనాలను కండీషన్‌లో ఉంచుకోవాలి : సీపీ



వాహనాలను తనిఖీ చేస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, ఫిబ్రవరి 27: పోలీస్ వాహనాలను సొంత వాహనాల్లా ఎప్పుడూ కండీషన్‌లో ఉంచుకో వాలని రామగుండం సీపీ శ్రీనివాస్ అధికారులు, డ్రైవర్లను ఆదేశించారు. మంగళవారం కమిషనరేట్ ప్రాంగణంలో పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలోని పోలీస్ వాహనాల పని తీరు, నిర్వహణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ వాహనాలు నిరంతరంగా ప్రజా సేవకు వినియోగిస్తున్నామన్నారు. వాహనాల నిర్వహ ణపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని, క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికలను సమర్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. వాహనాలను కండీషన్‌లో ఉంచుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు సర్వీసింగ్, ఇంజన్ ఆయిల్, టైర్ల నిర్వహణ పనులపై డ్రైవర్లు దృష్టి పెట్టాలన్నారు. డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆయన ఎంటీఓలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, ఆర్ఐ దామోదర్, ఎంటీఓలు శ్రీనివాస్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఖని ఆర్టీసీ డిపో మేడారం జాతర ఆదాయం రూ.1.3కోట్లు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 27: ఈ నెల 18 నుంచి 25 వరకు మేడారం జాతరకు గోదావరిఖని ఆర్‌టీసీ డిపోకు రూ.1.3కోట్ల ఆదాయం వచ్చినట్టు డీఎం నాగభూషణం చెప్పారు. గోదావరిఖని బస్టాండ్ నుంచి 135బస్సుల ద్వారా 1077ట్రిప్పులు నడిపించినట్టు డీఎం తెలిపారు. దీని ద్వారా రూ.1.3కోట్ల ఆదాయం వచ్చిందని, అదే విధంగా గోలివాడకు 12బస్సులు, 144ట్రిప్పుల ద్వారా రూ.4.26లక్షల ఆదాయం వచ్చినట్టు చెప్పారు. గోదావరిఖని డిపో నుంచి ఆర్‌టీసీ బస్సుల్లో ప్రయాణించిన భక్తులకు, సేవలందించిన లయన్స్‌క్లబ్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఆర్‌టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ కార్మికులకు స్వీట్లు పంపిణీ

మంథని, ఫిబ్రవరి 27: మేడారం మహాజాతరకు ప్రయాణికులను సురక్షితంగా తరలించిన మంథని, కరీంనగర్ ఆర్టీసీ డిపోల కార్మికులను కరీంనగర్ డిప్యూటీ ఆర్ఎం భూపతిరెడ్డి మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. కార్మికులకు స్వీట్లు పంపిణీ చేశారు. అందరి కృషి వల్లనే మేడారం మహాజాతర విజయవంతమైందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎం రాజశేఖర్, సీఐ ఏంజిల్, ఏడీసీల సూపర్‌వైజర్ ప్రసన్న, ఏడీసీలు బాలయ్య, ఎంఎల్ నారాయణ, కేకే రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

జాతరను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 27 : గోదావరిఖని సమ్మక్క-సారలమ్మ జాతరను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు, జాతర ఏర్పాట్లకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని ఈవో కాంతారెడ్డి చెప్పారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈసారి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించినట్టు, దీని కోసం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ చొరవతో జాతరను నిర్వహించారని, దీనికి సహాయసహకారాలు అందించిన ఎన్‌టీపీసీ, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, జెన్‌కోకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రూ.48.86లక్షల ఆదాయం వచ్చిందని, టెండర్ల ద్వారా రూ.13.84లక్షలు, దర్శనం టికెట్ల ద్వారా రూ.5.55లక్షలు, హుండీ ఆదాయం రూ.29.44లక్షలు వచ్చిందని తెలిపారు. గతంలో కంటే ఈసారి రూ.1లక్ష ఆదాయం తగ్గిందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జాతర కమిటీ చైర్మన్ పిన్నింటి శ్రీనివాస్‌రెడ్డి, బంగారి రాజయ్య, ముక్క రాజయ్య పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి శోభాయాత్ర



స్వామివారి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

పెద్దపల్లి రూరల్/పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 27 : పెద్దపల్లి మండలం పెద్దకల్వల క్యాంపులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి కల్వల క్యాంపు దేవాలయం నుంచి కలెక్టరేట్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు భక్తజన మండలి ఆధ్వర్యంలో శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఈనెల 23వ తేదీ నుంచి మార్చి 2 వరకు జరుగుతున్న ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం జరిగే స్వామివారి కల్యాణ మహోత్సవానికి ముందస్తుగా సోమవారం సాయంత్రం శోభాయాత్రను భక్తజన మండలి నిర్వహించారు. దారి పొడుగునా భజన కీర్తనలతో వేంకటేశ్వర స్వామి స్తోత్రాలతో స్వామివారి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. శోభాయాత్రలో కాంతార వేషధారణలు ఉండటంతో పలువురు వారితో సెల్ఫీలు దిగారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బొంకూరి శంకర్, ప్రభాకర్, చంద్రకళ, సందీప్‌రావు, శ్రీనివాస్, కొమురయ్య, సందీప్‌రెడ్డి, ఆకుల సురేష్, అంజి, సత్యనారాయణ, శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, శివప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్ గాదె మాధవి, రాజకుమార్, రాకేష్, మహేష్, విష్ణువర్ధన్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అధికారికి సన్మానం

రామగిరి, ఫిబ్రవరి 27: సింగరేణి ఏపీఏ డివిజన్ ఏఎల్‌పీ గనిలో పీఏగా పదవీ విరమణ పొందనున్న సాయిశ్రీనివాస్‌కు మంగళవారం జీఎం కార్యాలయంలో పర్సనల్ విభాగం అధికారులు సన్మానించారు. ముప్పిడి రవీందర్‌రెడ్డి, మారుతీ, గుర్రంశ్రీహరి, సునీల్‌ప్రసాద్, రాజేశం, ఉద్యోగులు మిర్యాలరాజిరెడ్డి, కళ్యాణం సుధాకర్, రమ్యరెడ్డి, వేణుగోపాల్, చిరంజీవి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రావ్‌పల్లె సమస్యలను పరిష్కరించండి

- మంత్రి శ్రీధర్‌బాబుకు గ్రామస్థుల వినతి

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 27: సింగరేణి ప్రభావిత గ్రామమైన వెంకట్రావ్ పల్లె గ్రామ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్‌బాబుకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైద్రాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఓసీపీ-3 ప్రాజెక్టు పక్కనే ఉన్న తమ గ్రామం ప్రాజెక్టు నుంచి వెలువడే దుమ్ము, విషవాయువులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. గాలి, నీరు కలుషితం అవుతున్నాయని, భారీ యంత్రాల శబ్దాలతో ప్రజలు అవస్థ పడుతున్నట్టు పేర్కొన్నారు. బ్లాస్టింగ్ సమయంలో భూమి కంపించడతో కొన్ని ఇండ్లగోడలకు పగుళ్ళు వచ్చాయని, బొగ్గు పెల్లలు, బండ రాళ్ళు ఇళ్ళపై పడి రేకులు పగులు తున్నాయని మంత్రికి తెలిపారు. వాయు, శబ్ద, జల కాలుష్యంతో గ్రామంలో ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయని, గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలని ఏళ్ళ తరబడి విజ్ఞప్తులు చేస్తున్నా న్యాయం జరగలేదని అన్నారు. గ్రామాన్ని సందర్శించి సమస్యలు పరిషరించేలా దృష్టి సారించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ సర్పంచ్‌లు చాట్ల సదానందం, బుర్ర ముత్యాలు, లక్ష్మణ్‌లతో పాటు గ్రామస్థులు ఉన్నారు.

ఓసీపీ-3 కార్మికులను కాంగ్రెస్ నాయకుడు

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 27: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి పెర్క శ్యాం మంగళవారం ఓసీపీ-3 కార్మికులను కలిశారు. కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కార్మికులతో ఆయన మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నియోజక వర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా టికెట్ ఆశిస్తున్నట్టు తెలిపారు. సింగరేణి కార్మికులు తనకు మద్దతుగా నిలవాలని కోరారు. ఆయన వెంట ఐఎన్‌టీయూసీ నాయకులు మార్కండే య, సీహెచ్ ప్రసాద్, లింగమూర్తి, సదయ్య, ఇస్మాయిల్, బంగారు స్వామి, రవీందర్‌రెడ్డి, కొంగర రవీందర్, శ్రీనివాస్ ఉన్నారు.

అండర్‌గ్రౌండ్ అలవెన్స్ రద్దు నిర్ణయం విరమించుకోవాలి

కాసిపేట, ఫిబ్రవరి 27: సింగరేణిలో కార్మికులకు అందజేసే అండర్‌గ్రౌండ్ అలవెన్స్ రద్దు చేయడాన్ని విరమించుకోవాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గత కొంత కాలంగా మందమర్రి ఏరియాలోని 400 మంది అండర్‌గ్రౌండ్‌కార్మికులను అవసరాల రీత్యా సర్ఫేస్ పనులు చేయించిందని తెలిపారు. సర్ఫేస్‌లో పనిచేస్తున్న కార్మికులకు అండర్‌గ్రౌండ్ అలవెన్స్‌లను కట్ చేస్తామని చెప్పడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. సింగరేణి అవసరాల కోసం కార్మికులను వాడుకుని అండర్‌గ్రౌండ్ అలవెన్స్‌లను కట్ చేయడం సరైంది కాదని, ఈ విధానాన్ని వెంటనే విరమించుకోవాలని కోరారు.

పారదర్శకంగా ఆఫీస్ అటెండెంట్ నియామకాలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 27: సింగరేణి మందమర్రి ఏరియాలో ఆఫీస్ అటెండెంట్ పోస్టులకు సంబంధించి పారదర్శకంగా నియమించామని ఎస్వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. స్థానిక జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఆఫీస్ అటెండెంట్ టీఎస్ గ్రేడ్ హెచ్ ఉద్యోగాలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. అదేవిధంగా రికార్డు అసిస్టెంట్ టీఅండ్ ఎస్ గ్రేడ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు చేపట్టారు. ఆఫీసు అటెండెంట్ రెండు పోస్టులకు 33మంది దరఖాస్తు చేసుకున్నారు. దీనిలో ముగ్గురు గైర్హాజరయ్యారు. రికార్డు అసిస్టెంట్‌కు నలుగురు దరఖాస్తు చేసుకొని నలుగురు హాజరయ్యారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ మాణికేశ్వర్‌రెడ్డి

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి27: గోదావరిఖని అడ్డగుంటపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మార్కండేయకాలనీలోని మహర్షి కళాశాలలో క్షయవ్యాధి నిర్మూలనపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాణికేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాను టీబీ రహితంగా మార్చేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. టీబీ వ్యాధి లక్షణాలను విద్యార్థులకు వివరించారు. ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని, పౌష్టికాహారం కోసం నెలకు రూ.500 ఆరు నెలల వరకు అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో చికిత్స పర్యవేక్షకులు గోపికృష్ణ, శ్రావణి, కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేత

ధర్మారం, ఫిబ్రవరి27: ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి లీలవతి దవే సైన్స్ ఫిక్షన్ కథల పోటీల్లో మండలంలోని నర్సింహులపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు వేల్పుల శ్రీలత ప్రథమ బహుమతి సాధించగా బొట్ల లక్ష్మిగణేష్ ప్రోత్సాహక బహుమతి పొందారు. వీరికి ప్రశంసా పత్రాలను, నగదును ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగుల రవీందర్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు కందుకూరి భాస్కర్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, అంజనేయులు, శ్రీధర్‌రెడ్డి, పుష్పలత, జ్యోతి, స్వరాజ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రధాని మోదీ కృషి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న జాడి బాల్‌రెడ్డి

ధర్మారం, ఫిబ్రవరి27: గ్రామాల్లో పేద ప్రజల అభ్యున్నతి, అభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో అనేక పథకాలను ప్రవేశ పెట్టారని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పత్తిపాక, నర్సింగాపూర్, ధర్మారం గ్రామాల్లో బస్తీ సంపర్క్ అభ్యాన్ కార్యక్రమంలో బాగంగా ఆయన ఇంటింటికి తిరిగి సంక్షేమ అభివృద్ధి పథకాల గూర్చి ప్రజలకు వివరించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నాయకులు మేడవేని శ్రీనివాస్,రాములుతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితురాలికి జడ్పీ చైర్మన్ పరామర్శ

మంథని, ఫిబ్రవరి 27: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని జడ్పీ చైర్మన్ పుట్ట మధు మంగళవారం పరామర్శించారు. పట్టణంలోని పోచమ్మవాడకు చెందిన బోనగిరి వైష్ణవి అనారోగ్యంతో హైదారాబాద్‌లోని శాలిని ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆమెను పుట్ట మధు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆరోగ్య పరిస్థితిని డాక్టర్ అడిగి తెలుసుకొని త్వరగా కోలుకునేలా చికిత్స ఇందించాలని పుట్ట మధు కోరారు.

సివిల్ రైట్స్‌డేలో అధికారులు పాల్గొనేలా చూడాలి

జూలపల్లి, ఫిబ్రవరి 27: సివిల్‌రైట్స్ డేలో మండలస్థాయి అధికారులంతా పాల్గొనేలా తగిన చర్యలు చేపట్టాలని మంగళవారం ఆలిండియా అంబేడ్కర్ సంఘం నాయకులు తహసీల్దార్ బషీరొద్దీన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు మామిడిపెల్లి చెంద్రశేకర్, మానుమండ్ల శ్రీనివాస్, సీపెల్లి గోపాల క్రిష్ణా, వడ్లూరి చంద్రమౌళి, కొట్టె సంజీవ్, మహేష్, సంపత్, దర్మరాజ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

వడుకాపూర్ ఉపాధ్యాయుడికి జాతీయస్థాయిలో గుర్తింపు



హిందీ పండిట్ అమరేందర్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జూలపల్లి, ఫిబ్రవరి 27: జూలపల్లి మండలం వడుకాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయుడు డాక్టర్ అమరేందర్ రాసిన రెండు వ్యాసాలు జాతీయ స్థాయిలో ప్రచురింపబడిన గ్రంథంలో చోటు లభించడంపై మండల ఉపాధ్యాయులు, ప్రజలు విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. వడుకాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమరేందర్‌ను ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

పేదలకు ఎల్లప్పుడు అండగా ఉంటా

ఎలిగేడు, ఫిబ్రవరి 27: నియోజకవర్గం ఉన్న పేదలకు అన్నివేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని శివపల్లి గ్రామంలో మంగళవారం అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి ఎల్‌ఓసీ చెక్కులను అందజేశారు. ఓదెల మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన తుమ్మ సదానందం నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆయనకు రూ.2లక్షల విలువ గల చెక్కు అందజేశారు. అదేమండలం గూడెం గ్రామానికి బేతి రవీందర్‌కు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.లక్ష చెక్కును ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు.

'యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు'



విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందిస్తున్న ముఖ్యఅతిథులు

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 27: దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని ట్రినిటి విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ట్రినిటి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన పట్టభద్రుల దినోత్సవానికి విద్యాసంస్థల చైర్మన్ దాసరి దాసరి ప్రశాంత్‌రెడ్డి, జేఎన్టీయూ కళాశాల జగిత్యాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగ అధిపతి, ఆచార్య సతీష్, డాక్టర్ పుల్ల సమ్మయ్య ఎస్సార్ యూనివర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మణి గణేష్, అకాడమిక్ డైరెక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ నటరాజన్, డాక్టర్ ఆరిఫ్, సురేష్ స్వాతి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.